క్లుప్తంగా

ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి



విలేకరులతో మాట్లాడుతున్న రఘునాథరెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్: ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కార్యదర్శి రఘునాథరెడ్డి కోరారు. కడప ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల సందర్భంగా ఎమ్మెల్యే సమక్షంలో ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల జీవన భృతి రూ.5వేలకు పెంచుతామని చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. ఏడాది దాటినా హామీ అమలుకు నోచుకోలేదన్నారు. మృతి చెందిన ఆర్టీసీ ఉద్యోగుల కుటుంబాలకు రూ.2500 పెన్షన్ ఇవ్వాలని, లగ్జరీ బస్సుల్లో ప్రయాణానికి ఇస్తున్న రాయితీని 75 శాతానికి పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

వైద్యుల సేవలు మరువలేనివి



ప్రసన్నలతను సత్కరిస్తున్న వైద్యులు, సిబ్బంది

కడప కోటిరెడ్డిసర్కిల్: కడప నాగరాజుపేట పట్టణ ఆరోగ్య కేంద్రంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న రామేశ్వరం ప్రసన్నలత సేవలు మరువలేనివని డాక్టర్ ప్రశాంత వర్ధన్ తెలిపారు. బదిలీపై సింహాద్రిపురం మండలం కోరుగుంటపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళుతున్న ప్రసన్నలతను బుధవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో ఇతరులు ప్రసన్నలతను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అరుణ్‌కుమార్, డాక్టర్ తరుణ్, డాక్టర్ జయశ్రీ,, డాక్టర్ ముస్కాన్, గంగామహేశ్వరి, హరీష్, రమాకాంత్, జగన్‌మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌ను కలిసిన పూల నాగరాజు

కడప కోటిరెడ్డిసర్కిల్: ఏపీఎస్ఆర్టీసీ కడప జోనల్ చైర్మన్ పూల నాగరాజు బుధవారం సాయంత్రం కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మృతి చెందిన ఉద్యోగుల కుటుంబాల్లోని వారికి ఉద్యోగాలు ఇవ్వాలని జోనల్ చైర్మన్ కలెక్టర్‌ను కోరారు. ఇదే క్రమంలో కలెక్టర్ ఆర్టీసీ ప్రయాణీకులకు కల్పిస్తున్న సౌకర్యాలను అధికారులను అడిగి తెలుసుకుని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఈడీ పైడి చంద్రశేఖర్, ఆర్ఎం గోపాల్‌రెడ్డిలు పాల్గొన్నారు.

ఆక్రమణల కూల్చివేత



ఆక్రమణలను తొలగిస్తున్న అధికారులు

చింతకొమ్మదిన్నె : మండలంలోని మామిళ్లపల్లె గ్రామ పొలం సర్వే నెంబర్ 39లో ఇటీవల నిర్మాణం చేపట్టిన రెండు ఇళ్లను చింతకొమ్మదిన్నె రెవెన్యూ సిబ్బంది జేసీబీతో కూల్చివేయించారు. సర్వే నెంబర్ 39 రెవెన్యూ రికార్డుల మేరకు రైల్వే రిజర్వుడ్ భూమిగా నమోదైనట్లు, అందుకే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇటీవల చేపట్టిన నిర్మాణాల కూల్చివేత చేపట్టినట్లు మామిళ్లపల్లె గ్రామ రెవెన్యూ అధికారి అబ్బాస్ తెలిపారు.

ప్రకృతి వ్యవసాయం ద్వారా అధిక దిగుబడులు

ఒంటిమిట్ట: ప్రకృతి వ్యవసాయం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ ఎం వీరయ్య అన్నారు. కృషి విజ్ఞాన కేంద్రాల ద్వారా ప్రకృతి వ్యవసాయాన్ని పెంపొందించే కార్యక్రమానికి సంబంధించి బుధవారం ఒంటిమిట్ట మండల పరిధిలోని చింతరాజుపల్లి గ్రామంలో రెండురోజుల శిక్షణా కార్యక్రమంలో భాగంగా మొదటిరోజు కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ ఎ.వీరయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయంతో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి, అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. ఆర్థిక, ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చని, ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్‌లో డిమాండ్ పెరుగుతుందని, కావున నాణ్యతపరమైన ఉత్పత్తులను పెంపొందించడం కోసం రైతులు ఎంతో కృషి చేయాలని సూచించారు. అనంతరం వారు అరటిలో యాజమాన్య పద్ధతులు గురించి అవగాహన కల్పించారు.

● మూన్నెళ్లకే... మళ్లీ గోతులు



కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రహదారుల్లో గోతులు పూడ్చి గుంతల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని నేతలు హామీ ఇచ్చారు. తూతూ మంత్రంగా చేపట్టిన మరమ్మతులకు మూడు నెలలకే రహదారుల్లో మళ్లీ గోతులు దర్శనమిస్తున్నాయి. కడప చిన్నచౌక్ రామాంజనేయపురం వద్ద రహదారి పరిస్థితి ఇదీ..

● క్యూలైన్లలో.. రేషన్ కష్టాలు



– సాక్షి ఫొటోగ్రాఫర్, కడప

కడప ప్రకాశ్‌నగర్‌లో సర్వర్ మొరాయించడంతో రేషన్ బియ్యం తీసుకునేందుకు ప్రజలు క్యూలైన్‌లో గంటల తరబడి నిలబడాల్సిన పరిస్థితి. విసుగు చెందిన ప్రజల్లో కొందరు వెనుదిరిగి వెళ్తున్నారు. మరికొందరు వేచి యుండి క్యూలైన్‌లో నిలబడి రేషన్ తీసుకుంటున్న దృశ్యం సాక్షి కెమెరా బంధించింది.

పుస్తకాల బహూకరణ

కడప ఎడ్యుకేషన్: సీపీ బ్రౌన్ గ్రంథాలయానికి దూరదర్శన్ విశ్రాంత అదనపు డైరెక్టర్ డా.రేవూరి అనంతపద్మనాభరావు, విద్యుత్తు శాఖ విశ్రాంత ఎస్ఈ కోడూరు పుల్లారెడ్డి బుధవారం 500 పుస్తకాలు అందజేశారు. వారి నివాస గృహాలకు వెళ్లి గ్రంథాలయ సిబ్బంది జి.హరిభూషణరావు, సి.నీలకంఠేశ్వర్, బి.హరికృష్ణ ఆ పుస్తకాలు స్వీకరించారు. ఈ సందర్భంగా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి మాట్లాడుతూ రివర్స్ ఆఫ్ ఇండియా, ఫెస్ట్‌స్క్రిప్ట్, పుట్టపర్తి రచనల్లో భారతీయ సంస్కృతి, శతజయంతి సాహితీమూర్తులు, విలక్షణ పీవీ.కత్తి కాంతారావు, ఆచార్య వెలుదండ నిత్యానందరావు సమగ్ర సాహిత్యం2 తదితర పుస్తకాలు ఉన్నాయన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప వైఎస్ఆర్ సర్కిల్: కడప నగరంలో డివిజన్ ఇన్‌చార్జిల నియామకానికి దరఖాస్తు స్వీకరిస్తున్నట్లు డీసీసీ అధ్యక్షురాలు విజయజ్యోతి ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 5వ తేదీ లోగా తమ దరఖాస్తులను జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు, ఇందిరాభవన్, జిల్లా కాంగ్రెస్ కార్యాలయం, 1/27-9, ఏపీహెచ్‌బీ కాలనీ, కడప చిరునామాకు పంపాలన్నారు.

కడప, ప్రొద్దుటూరు ఎంఈఓ లపై చర్యలు తీసుకోవాలి



డీఈఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కడప ఎడ్యుకేషన్: ఎస్‌జీటీ బదిలీల మ్యాన్యువల్ కౌన్సిలింగ్‌లో ప్రిఫరెన్షియల్ కేటగిరిలో ఇవ్వాల్సిన స్థానాలకంటే అధికంగా కేటాయించిన కడప, పొద్దుటూరు ఎంఈఓలపై చర్యలు తీసుకోవాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్‌బాబు కోరారు. డీఈవో షేక్ శంషుద్దీన్ కడపలోని ఆయన కార్యాలయంలో బుధవారం కలిసి ధర్నా నోటీసు అందజేశారు. వారు మాట్లాడుతూ పదోతరగతి మూల్యాంకనం చేసిన వారికి పారితోషకం చెల్లించడంతో నిర్లక్ష్యం చేస్తున్నారని, సమస్యలు పరిష్కరించకపోతే జులై 9న కడప డీఈఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. కడప, ప్రొద్దుటూరు ఎంఈఓల తీరుతో ఉపాధ్యాయులకు తీరని నష్టం జరిగిందన్నారు. ప్రభుత్వం రూపొందించిన బదిలీల చట్టం–2025 ప్రకారం ప్రిఫరెన్షియల్ కేటగిరీకి 40 శాతానికి మించి పోస్టులు కేటాయించకూడదనే నిబంధన ఉన్నా.. ఇష్టారాజ్యంగా పోస్టులు కేటాయించారన్నారు. పదిమంది జనరల్ కేటగిరీ ఉపాధ్యాయులు నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. బదిలీల కౌన్సిలింగ్ పూర్తయి 20 రోజులైనా ఇంతవరకూ ఎంఈఓలపై చర్యలు తీసుకోకపోవడం తగదన్నారు.

పది పరీక్షల మూల్యాంకనం పూర్తయి మూడు మాసాలు కావస్తున్నా పారితోషికం చెల్లించకపోవడం తగదన్నారు.

మైనార్టీ విభాగం బలోపేతానికి కృషి



జమీల్‌ను సత్కరిస్తున్న అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగాన్ని బలోపేతం చేయడానికి కృషి చేయాలని మాజీ ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా కోరారు. జిల్లా మైనార్టీ విభాగం ప్రధాన కార్యదర్శిగా నియమితులైన జమీల్ బుధవారం అంజద్‌బాషాను మర్యాద పూర్వకంగా కలిశారు. అంజద్‌బాషా మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉద్యమాల నుంచి పుట్టిందని, కష్టపడే కార్యకర్తలకు తప్పక గుర్తింపు లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దాసరి శివప్రసాద్, అజ్మతుల్లా, ముస్తాక్, జాకీర్, హీన, ఫయాజ్, అఫ్రోజ్, అబ్దుల్లా, మురళి, అస్లం, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలని కార్మికుల భిక్షాటన



భిక్షాటన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

కడప కార్పొరేషన్: మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం కార్మికుల వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధవారం అర్ధ నగ్నంగా బిక్షాటన చేశారు. కడప కోటి రెడ్డి సర్కిల్ నుంచి కార్పొరేషన్ వరకు సాగిన ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి గోపి మాట్లాడుతూ మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులను ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని, తల్లికి వందనం పథకం వర్తింపజేయకపోవడం అన్యాయమన్నారు. రూ.25000 లోపు వేతనం తీసుకునే వారికి సంక్షేమ పథకాలు అమలు చేస్తామని ఇచ్చిన హామీ నెరవేర్చాలని, జీవో నెంబర్ 36 ప్రకారం రూ.24500 రూపాయల వేతనం ఇవ్వాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్ల కింద రూ.75000, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. పదవీ విరమణ వయసు 62 సంవత్సరాలకు పెంచాలని, ఈ నెల 4న విజయవాడ ధర్నాచౌక్ వద్ద ఆందోళన నిర్వహించనున్నామని తెలిపారు. చంద్రారెడ్డి, బ్రహ్మానంద రెడ్డి, సుంకరరవి, ఇత్తడిప్రకాష్, ఓ.సుబ్బారాయుడు, గురవయ్య, వెంకటేష్, గోవర్ధన్, రాంమోహన్‌రెడ్డి, చిన్నఓబులయ్య పాల్గొన్నారు.


కోర్టు ఉత్తర్వులున్నా.. వక్ఫ్ ఆస్తుల కబ్జా



వక్ఫ్ ఇన్‌స్పెక్టర్‌కు విన్నవిస్తున్న మగ్బూల్‌బాషా

కడప సెవెన్‌రోడ్స్: న్యాయ స్థానాల ఉత్తర్వులు ఉన్నప్పటికీ వక్ఫ్ ఆస్తులను కబ్జా చేసిన వారిపై కేసులు నమోదుచేయాలని ఆప్‌కీ ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి మగ్బూల్ బాషా, మైనార్టీ రైట్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు దస్తగిరి కోరారు. వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ వసీంను బుధవారం ఆయన కలిసి వినతిపత్రం సమర్పించారు. కడప నగరంలో చాలాచోట్ల వక్ఫ్ ఆస్తులు ఆక్రమించి విలాసవంత భవనాలు నిర్మించుకుంటున్నారన్నారు. బిల్టప్ సర్కిల్ వద్ద వక్ఫ్ స్థలాన్ని ఆక్రమించి గదులు నిర్మించుకుంటున్నారని, అక్కడ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. పాత బస్టాండు పెట్రోలు బంకు ఎదురుగా గతంలో ప్రజా వైద్యశాల స్థలాన్ని ఆక్రమించి పెద్ద భవనం నిర్మిస్తున్నారని, కోర్టు ఎదురుగా రోషన్ మున్వర్ మసీదు వద్ద రాత్రికి రాత్రే షెడ్డు నిర్మించారన్నారు. వాటిపై విచారణ నిర్వహించాలని కోరారు. రెవెన్యూ, పోలీసుల సహాయం అందితే వక్ఫ్ ఆస్తులు కాపడతామన్నారు.

టెండర్ వేసిన వారికే గదులు కేటాయించాలి



ఈడీకి సమస్యలను వివరిస్తున్న సీపీఎం బృందం

కడప కోటిరెడ్డిసర్కిల్: కడప ఆర్టీసీ బస్టాండులో ఆరు నెలల కిందట టెండర్లు వేసిన వారికి ఇప్పటి వరకూ గదులు చూపెట్టలేదని సీపీఎం కడప నగర కార్యదర్శి రామ్మోహన్ అన్నారు. కడప ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చంద్రశేఖర్‌ను బుధవారం ఆయన కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప ఆర్టీసీ బస్టాండులో గదుల విషయంలో పేదలకు తగిన న్యాయం చేయాలన్నారు. గత ఏడాది సెప్టెంబర్‌లో దళిత మహిళ స్రవంతి పీ17ఏ, పీ17సి రూములను టెండర్లలో దక్కించుకున్నారన్నారు. ఆర్టీసీ యాజమాన్యం ఆర్డర్ జారీ చేసిందన్నారు. అయితే ఇప్పటివరకూ కొలతలు వేసి రూములు చూపెట్టకుండా ఆర్టీసీ ఆర్ఎం, ఈడీ, సివిల్ ఇంజినీరింగ్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. నిరుద్యోగులపై రీజినల్ మేనేజర్ ఇలా వ్యవహరించడం ఏమాత్రం సరికాదన్నారు. లక్షలాది రూపాయల ఆదాయం వస్తున్నా.. షాపుల నిర్వాహకులకు సరైన సదుపాయాలు కల్పించకపోవడం మరింత దారుణమన్నారు. సమస్య పరిష్కరించకపోతే బాధితులను కలుపుకొని ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బి.దస్తగిరి రెడ్డి, నరసింహ, గోవిందు, పి.స్రవంతి, ఎస్.కదిరున్, భాగ్యమ్మ జోసెఫ్, తదితరులు పాల్గొన్నారు.

వైవీయూలో డైనింగ్ హాల్ ప్రారంభం

కడప ఎడ్యుకేషన్: యోగి వేమన విశ్వవిద్యాలయం గురుకులం విభాగంలో విద్యార్థినుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక డైనింగ్ హాల్‌ను వైవీయూ కుల సచివులు ఆచార్య పుత్తా పద్మ, ప్రధానాచార్యులు టి.శ్రీనివాస్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురుకులంలో కామర్స్, ఎంబీఏ, ఎంసీఏ విద్యార్థులు మధ్యాహ్నం సమయంలో భోజనం కోసం కిలోమీటర్ దూరంలోని మెస్‌కు బస్సుల్లో రావాల్సి వచ్చేదని తెలిపారు. నేటితో ఆ సమస్య పరిష్కారం అయిందన్నారు. ఈ కార్యక్రమంలో వై.సుబ్బరాయుడు, ఎస్.రఘునాథరెడ్డి, డాక్టర్ పి.సరిత, ఎంసీఏ విభాగాధిపతి డాక్టర్ శ్రీనివాసరావు, ఆచార్య విజయభారతి, డాక్టర్ రెడ్డయ్య, పాల్గొన్నారు.

జిల్లా సైనిక్ వెల్ఫేర్ ఆఫీసర్‌కు ఘనస్వాగతం



అధికారిని సన్మానిస్తున్న మాజీ సైనికులు

కడప అర్బన్: వైఎస్ఆర్ జిల్లా సైనిక్ వెల్ఫేర్ ఆఫీసర్‌గా భక్తవత్సలరెడ్డి ఈ నెల 1న బాధ్యతలను స్వీకరించారు. ప్రస్తుత అధికారి, మునుపటి అధికారి రజాక్‌ఖాన్‌లను సైనిక్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు దాసరి రమణయ్య ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సైనిక్ వెల్ఫేర్ ఆఫీసర్ భక్తవత్సల రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని మాజీ సైనికుల సమస్యలను పూర్తిగా పరిష్కరిస్తామని హాహామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలోఎస్ఎస్ రాముడు, జాయింట్ సెక్రటరీ బీవీ.గోపాల్ రెడ్డి, ఎల్.చంద్రమోహన్ రెడ్డి, ఎన్.శింగరయ్య, పుల్లారెడ్డి, నాగభూషణ్‌రావు, శివగంగయ్య పాల్గొన్నారు.

జిల్లా రచయితల పరామర్శ



హనుమంతరావును పరామర్శిస్తున్న రచయితలు

కడప సెవెన్‌రోడ్స్: తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న సాహితీవేత్త డాక్టర్ విద్వాన్ గానుగపెంట హనుమంతరావును వైఎస్సార్ కడపజిల్లా రచయితల సంఘం నాయకులు బుధవారం పరామర్శించారు. ఆయన క్షేమ సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. తమ రచయితల సంఘానికి ఉపాధ్యక్షుడిగా కీలక పాత్ర వహిస్తున్న హనుమంతరావుకు శస్త్ర చికిత్స జరిగిందని రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు మూల మల్లికార్జునరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో భూమిరెడ్డి స్వరూపరాణి, డాక్టర్ తవ్వా వెంకటయ్య, డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, డాక్టర్ కొప్పోలురెడ్డి శేఖర్ రెడ్డి, డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి, డాక్టర్ ఏవీఎస్.రాజు, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలి



నర్సరీలో సిద్ధంగా ఉంచిన మొక్కలు

సిద్దవటం : పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని పెంచాలని కడప రేంజర్ ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన రాజీవ్ స్మృతివనంలో మాట్లాడుతూ కడప ఫారెస్టు రేంజి పరిధిలోని జేఎంజే కళాశాలకు ఎదురుగా ఉన్న రాజీవ్ స్మృతి వనంలోని నర్సరీలో వేప, నేరేడు, ఉసిరి, ఎర్రచందనం, కానుగ, నెమలినారా, గన్నేరు, గుల్ మహల్ తదితర రకాలకు చెందిన 4 లక్షల మొక్కలను పెంచుతున్నామన్నారు. ఈ నెల 5వ తేదీన విద్యార్థులకు మొక్కలు అందజేసి నాటించే కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి



సూపరింటెండెంట్‌కు విన్నవిస్తున్న నాయకులు

కడప కార్పొరేషన్: కడప ప్రకాష్ నగర్‌లోని ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టల్‌లో విద్యార్థుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు సాయిదత్త డిమాండ్ చేశారు. కలెక్టర్ కార్యాలయంలోని సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయం సూపరింటెండెంట్ శివారెడ్డిని బుధవారం ఆయన కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకాష్‌నగర్‌లోని ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లలో కనీస సౌకర్యాలు కరువయ్యాయని, వర్షం వస్తే గదుల్లో నీరు చేరుతోందని, కిటికీలకు అద్దాలు పగిలిపోయాయని అన్నారు. స్విచ్ బోర్డులు ఊడి వైర్లు ప్రమాదంగా మారాయని, మరుగుదొడ్లకు డోర్లు లేక, ప్రహరీగోడలు లేక విద్యార్థులకు రక్షణ కరువైందని తెలిపారు. హాస్టల్ ఆవరణంలో పిచ్చి మొక్కలు పెరిగి విషపురుగులు సంచరిస్తున్నా విద్యార్థులు బిక్కుమంటూ కాలం గడుపుతున్నారన్నారు. విద్యార్థులకు పెట్టే ఆహారంలో నాణ్యత లేదని, వారానికి ఒకసారి చికెన్ పెట్టడం లేదని, సురక్షిత తాగునీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించేందుకు చొరవ తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి విభాగం నగర అధ్యక్షుడు శివారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యామ్, ఉపాధ్యక్షుడు షేక్ జబ్బార్, కడప నగర ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్, నాయకులు పాల్గొన్నారు.

నోరు తెరచిన మ్యాన్‌హోల్



కడప పాత బస్టాండులోని తేజ హోటల్ నుంచి తిరుమల హాస్పిటల్‌కు వెళ్లే దారిలో మ్యాన్ హోల్ నోరు తెరచుకుని ప్రమాదకరంగా కనిపిస్తోంది. గ్రిల్స్ వేయకపోవడంతో ఇటీవల ఇద్దరు అందులోపడి గాయాలపాలయ్యారు. రద్దీగా ఉండే ఈ ప్రదేశంలోని మ్యాన్‌హోల్‌కు గ్రిల్స్ వేయాలని 30వ డివిజన్ కార్పొరేటర్ ఎస్ఎండీ షఫీ కోరారు.

– కడప కార్పొరేషన్

మహిళలు ఆర్థికంగా వృద్ధిచెందాలి



రివాల్వింగ్ ఫండ్ రుణాల చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డి

చింతకొమ్మదిన్నె : స్వయం సహాయక సంఘాల సభ్యులు ఆర్థికంగా వృద్ధి చెంది పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి సూచించారు. స్థానిక మండల వెలుగు కార్యాలయ ప్రాంగణంలో బుధవారం స్వయం సహాయక సంఘాలకు రివాల్వింగ్ ఫండ్ రుణాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్వయం సహాయక సంఘాలను ప్రభుత్వం ఎంతగానో ప్రోత్సహిస్తోందన్నారు. ఈ సందర్భంగా మండలం ఆస్పిరెంట్ మండలంగా ఎంపిక అయినందున కేంద్ర ప్రభుత్వం ఒక్కో స్వయం సహాయక సంఘానికి పదివేలు రూపాయల చొప్పున 100 గ్రూపులకు పదిలక్షల రూపాయలు ఇస్తున్నట్లు, దీనిని సంఘంలోని వారు వడ్డీ లేకుండానే ఉచితంగా సంఘ అవసరాలకు ఉపయోగించుకోవాలన్నారు. అలాగే స్త్రీనిధి, బ్యాంకు రుణాలు కలిపి మొత్తం ఒక కోటి 65 లక్షల రూపాయలు మెగా చెక్కును డి.ఆర్.డి.ఏ.పి.డి. రాజ్యలక్ష్మి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం రాజు, సీసీలు, వీఓఏలు, సర్పంచ్ మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు ఏకరువు పెట్టిన మహిళలు

మండలంలోని బుసిరెడ్డిపల్లె దళితవాడ, పెద్ద కాంపల్లె మహిళలు తమ గ్రామంలో వీధి లైట్లు, రోడ్లు లేక తీవ్ర అవస్థలు పడుతున్నట్లు తెలిపారు. జమాలపల్లె దళితవాడ మహిళలు తమ గ్రామంలోని మురికి కాలువలు మూయక పోవడంతో అందులో పిల్లలు పడుతున్నారన్నారు. గుర్రంగుంపు తాండ మహిళలు తమకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ త్వరగా ఇప్పించాలని, అలాగే తమ ఆర్ అండ్ ఆర్ కాలనీ లోని ఇళ్లకు పట్టాలు ఇవ్వాలని కోరారు. కొందరు మహిళలు తమకు తల్లికి వందనం డబ్బులు పడలేదని, అర్హత కలిగి డబ్బులు పడని అందరికి పడేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

వ్యాధులు రాకుండా జాగ్రత్తలు పాటిద్దాం



అవగాహన కల్పిస్తున్న ఏడీఎంహెచ్‌ఓ డాక్టర్ రవిబాబు

సిద్దవటం : వ్యాధులపై అవగాహన ఉంటేనే వాటిని రాకుండా జాగ్రత్త పడవచ్చని అడిషనల్ జిల్లా వైద్యాధికారి డాక్టర్ రవిబాబు తెలిపారు. బుధవారం ఆయన మండలంలోని చాముండేశ్వరీపేట గ్రామ సమీపంలో ఉన్న సెయింట్ అంథోని హైస్కూల్‌లో విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. జూలై 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు డెంగ్యూ మాసోత్సవాలు జరుగుతున్నాయన్నారు. విద్యార్థులు, పాఠశాల అధ్యాపక బృందానికి డెంగ్యూ వ్యాధిపై పలు సూచనలు, సలహాలు చేశామన్నారు. క్షయ లక్షణాలు తెలియజేసి, అనుమానం ఉన్నవారు పరీక్షలు చేయించుకొని, నిర్ధారణ అయితే చికిత్స పొందాలన్నారు. అనంతరం జాతీయ టీకా విధానంపై సమీక్షించారు. అలానే మాధవరం పీహెచ్‌సీని తనిఖీ చేసి ల్యాబ్, టీకాల రిజిస్టర్‌లను పరిశీలించి వైద్య సిబ్బందితో సమావేశమయ్యారు. కార్యక్రమంలో డాక్టర్ శివకుమార్, సూపర్‌వైజర్లు నాగవల్లి, జ్యోతికళ, రమణయ్య, యానాదయ్య, ఏఎన్ఎం ఖుర్షీద్, ఆశ కార్యకర్తలు పెంచలమ్మ, శకుంతల, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప అఖండ నామ సంకీర్తన



వేదికపై భక్తిగీతాలాపన చేస్తున్న గురుస్వాములు



కార్యక్రమంలో పాల్గొన్న భక్త బృందం సభ్యులు

కడప సెవెన్‌రోడ్స్: స్వచ్ఛమైన హిందువుగా నిబద్ధతతో కూడిన ధార్మిక జీవనం కొనసాగించాలని అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు రాజ్‌దేశ్‌పాండే అన్నారు. నగర శివారులోని డీఎస్ఆర్ కల్యాణ మండపంలో నిర్వహించిన నీ గానమే నా ప్రాణం కార్యక్రమం బుధవారం జరిగింది. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే గాక, కర్ణాటక నుంచి భక్తులు రావడంతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ముందుగా రాజ్‌దేశ్ పాండే కాషాయ ధ్వజారోహణం చేసి భక్తి శ్రద్ధలతో స్వదేశీ గోపూజ నిర్వహించారు. అఖండ జ్యోతి ప్రజ్వలన అనంతరం నీ గానమే నా ప్రాణం కార్యక్రమం ప్రారంభమైంది. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఏకధాటిగా అయ్యప్పస్వామి అఖండ నామ సంకీర్తన కొనసాగింది. గురుస్వాములు, శిష్య బృందాలు ఆలపించిన భజనలు, పాటలు భక్తుల్లో భక్తిపారవశ్యాన్ని నింపాయి. సాయంత్రం స్వామికి అభిషేకం, పడిపూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గురుస్వాములు అతిథులను సన్మానించారు. రాత్రి 8 గంటలకు హారతి, హరివరాసనం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచార సమితి రాష్ట్ర అధ్యక్షుడు దేశు వెంకటరెడ్డి, కార్యదర్శి వాసు గురుస్వామి, జిల్లా అధ్యక్షుడు దేవతి శంకరయ్య, కార్యదర్శి నందారపు చెన్నకృష్ణారెడ్డి, సి.వెంకటరెడ్డి, బాలకృష్ణారెడ్డి, శ్రీరంజన్‌రెడ్డి, వెంకట సుబ్బయ్య పాల్గొన్నారు.